నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 1 మే 2024 | RANGAREDDY



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

- అలాంటి వ్యక్తికి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలి
- కేసీఆర్ రోడ్‌షోలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి
- శంకర్‌పల్లిలో బీఆర్ఎస్ బూత్ స్థాయి ఇన్‌చార్జిల సమావేశం, దోమలో మండల స్థాయి ప్రజా ఆశీర్వాద సభ
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

# నమ్మకద్రోహి.. రంజిత్‌రెడ్డి

షాబాద్/దోమ, ఏప్రిల్ 30 : రంజిత్‌రెడ్డి.. నమ్మకద్రోహి అని.. బీఆర్ఎస్ పార్టీని నమ్మించి వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. మంగళవారం చేవెళ్ల నియోజకవర్గం, శంకర్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి ఇన్‌చార్జిల సమావేశం.. అదేవిధంగా దోమ మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజా ఆశీర్వాద సభలో ఆమె.. బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, పార్లమెంట్ ఇన్‌చార్జి రాంబాబుయాదవ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. రంజిత్‌రెడ్డి ఐదేండ్లు కేసీఆర్, కేటీఆర్‌ల వెంటే ఉండి నమ్మించి మోసం చేశాడని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ మొట్టమొదటి ఎంపీ టికెట్‌ను కేటాయించింది చేవెళ్ల రంజిత్‌రెడ్డికేనని..చేవెళ్లలో కేటీఆర్‌తో మొదటి సమావేశాన్ని కూడా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఒకవైపు పార్టీ అధినేత కేసీఆర్ కాలుకు గాయం, మరోవైపు ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసిన రోజే.. మానవత్వం మరిచి స్వార్థం, సొంత ప్రయోజనాలకోసం కాంగ్రెస్ కండువా కప్పుకొన్న రంజిత్‌రెడ్డికి కచ్చితంగా బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు సూచించారు. కార్యకర్తలను కూడా కాంగ్రెస్ పార్టీలోకి రమ్మంటే...తాామూ మీ వెంట రామని.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటే ఉంటామని చెప్పినట్లు ఆమె గుర్తు చేశారు. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డి ఓడిపోతాడని తెలియడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే మూడుసార్లు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి వచ్చివెళ్లారని.. ముఖ్యమంత్రి పదిసార్లు వచ్చి ప్రచారం చేసినా చేవెళ్లలో గెలిచేది బీసీనేత కాసాని జ్ఞానేశ్వరేనని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదని.. ఏ పార్లమెంట్ సెగ్మెంట్‌కు వెళ్లినా ప్రజలు అధికంగా తరలివచ్చి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మీ హయాంలో జరిగిన పనులే బాగున్నాయని..అన్ని వర్గాల ప్రజలు మంచిగా ఉన్నారని ప్రజలే స్వయంగా కేసీఆర్‌కు చెబుతున్నారన్నారు. అలవి కాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ఆ పార్టీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు దేవుళ్లపై ప్రమాణాలు చేస్తూ ప్రజలను మరోసారి మోసగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్ల ప్రాంత ప్రజలకు ఎలాంటి కష్టమొచ్చినా స్థానిక ఎమ్మెల్యే యాదయ్యతోపాటు ఇంద్రారెడ్డి కుటుం బం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరోసారి బీఆర్ఎస్‌ను రాష్ట్రం లో అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి రామచంద్రారావు, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ నాగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్యముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, పార్టీ మండలాల అధ్యక్షులు గోపాల్, గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు శశిధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం దోమ మండలాధ్యక్షుడు రాజిరెడ్డి,ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపిస్తా



పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపీగా ఆశీర్వదించి గెలిపిస్తే తెలంగాణ వాణిని పార్లమెంట్‌లో వినిపిస్తా. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ప్రజలు సంతోషంగా ఉండాలని కేసీఆర్ అన్ని వసతులను కల్పించారు. మహిళలు ఇబ్బందులు పడొద్దని ఇంటింటికీ భగీరథ నీటిని అందించారు. అమలు కాని హామీలతో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యలు పరిష్కారం కావడంలేదు. విద్యుత్తు, తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలి. బీఆర్ఎస్ శ్రేణులు తమ గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి గులాబీ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలి.

**-కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి**



హజరైన బీఆర్ఎస్ శ్రేణులు

### చేవెళ్లలో బీఆర్ఎస్ స్ట్రాంగ్‌గా ఉన్నది



కొంతమంది నాయకులు పార్టీని వీడినా ఎలాంటి నష్టంలేదు. ఐదేండ్ల క్రితం రంజిత్ రెడ్డి అంటే ఎవరో ఇక్కడి ప్రజలకు తెలియదు. కేసీఆరే ఇక్కడికి తీసుకొచ్చి ఎంపీగా నిలబెడితే మనమంతా కలిసి గెలిపించాం. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కూడా కేసీఆర్ నిలబెడితేనే ఎం పీగా గెలిపించుకున్నాం. ఐదేండ్లు బీఆర్ఎస్ ఎంపీగా ఉండి వ్యాపారం చేసుకుని లక్షలు, కోట్ల రూపాయలు లాభపడ్డారు. పదేండ్లు పార్టీలో ఉండి అక్రమంగా డబ్బులు, భూము లు సంపాదించుకున్న వారే ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారు. అసలైన కార్యకర్తలు ఎవరూ పార్టీ నుంచి వెళ్లడంలేదు. చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ పార్టీ స్ట్రాంగ్‌గా ఉన్నది. పార్టీ మారుతున్నట్లు నన్ను బద్నాం చేస్తున్నారు. పార్టీ మారే ప్రసక్తేలేదు. మనమందరం ఐక్యంగా ఉండి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు గిఫ్టుగా ఇద్దాం.

**- కాలె యాదయ్య, ఎమ్మెల్యే చేవెళ్ల**

### బీసీ బిడ్డను గెలిపించుకోవాలి : స్వామిగౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్



పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీసీనేతకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం ఇవ్వడం సంతోషకరం. బీసీలందరూ పార్టీలకతీతంగా కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలి. ఆయన బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. బీసీ బిడ్డను గెలిపించి బీసీల ఆత్మగౌరవాన్ని చాటాలి. పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యల గురించి మాట్లాడాలంటే బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభకు వెళ్లాల్సిన అవసరం చాలా ఉన్నది. కేసీఆర్‌ను మంచికో.. చెడుకో.. తులం బంగారానికో ఓడగొట్టుకున్నామని ప్రతి గ్రామంలోని మహిళలు బాధపడుతున్నారు. 16 లక్షల 80 వేల ఓట్లు ఉన్న చేవెళ్ల పార్లమెంట్‌లో అందరూ ఏకతాటిపైకి వచ్చి బీసీ నేత కాసానికి వేస్తే భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయం.

# 'పది' ఫలితాల్లో మెరిసిన బాలికలు

- రంగారెడ్డి జిల్లాలో 91.01 శాతం ఉత్తీర్ణత నమోదు
- గతేడాదితో పోలిస్తే పెరిగిన పర్సంటేజీ
- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 24వ స్థానం
- ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు

2024లో జిల్లాలో ఉత్తీర్ణత ఇలా..

| కేటగిరీ | హాజరైంది | ఉత్తీర్ణులు | శాతం |
|---|---|---|---|
| బాలురు | 26,446 | 23,508 | 88.89 |
| బాలికలు | 24,365 | 22,737 | 93.32 |
| మొత్తం | 50,811 | 46,245 | 91.01 |

రంగారెడ్డి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. గడిచిన నాలుగేండ్లతో పోలిస్తే ప్రస్తుత ఏడాది జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైనది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగిన 10 వ తరగతి పరీక్ష ఫలితాలను మంగళవారం విద్యాశాఖ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జిల్లా 91.01 శాతం ఉత్తీర్ణతను సాధించి రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచింది.

**బాలికలదే హవా..**

టెన్త్ ఫలితాల్లో జిల్లాలో బాలికలదే హవా కొనసాగింది. 26,446 మంది బాలురు పరీక్షలు రాయగా.. 23,508(88.89 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 24,365 మంది పరీక్షలు రాయగా.. 22,737(93.32 శాతం)మంది పాసై పైచేయి సాధించారు. ప్రతి ఏడా జిల్లాలో పదోతరగతిలో ఉత్తీర్ణత పెరుగుతూ వస్తున్నది. 2019 సంవత్సరంలో 92.83 శాతం ఫలితం రాగా.. 2016 నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. 2020, 2021 సంవత్సరాల్లో కొవిడ్ కారణంగా ప్రభుత్వం విద్యార్థులనందరినీ ఉత్తీర్ణులుగా ప్రకటించింది. ఆ తర్వాత జరిగిన రెండేండ్ల ఫలితాలను పోల్చితే జిల్లా ఉత్తీర్ణతా శాతం మెరుగుపడడం విశేషం.

**ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు..**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చింది. ఆధునిక విద్యాబోధనను అందించడంతోపాటు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నది. మధ్యాహ్న భోజనంతోపాటు కేసీఆర్ అల్పాహార పథకాన్ని అమలు చేసింది. వెనుకబడ్డ విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులను నిర్వహించడం వంటి చర్యలతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఆదర్శ పాఠశాలలు, కేజీవీబీ, గురుకుల పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షలు రాసిన పేద కుటుంబాల విద్యార్థులు తాజా.. ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచారు.

2016 నుంచి జిల్లాలో ఉత్తీర్ణత ఇలా..

| సంవత్సరం | హాజరైన వారు | ఉత్తీర్ణులైన వారు | శాతం |
|---|---|---|---|
| 2016 | 90,607 | 74,360 | 82.09 |
| 2017 | 42,706 | 36,164 | 84.68 |
| 2018 | 43,392 | 37,809 | 87.13 |
| 2019 | 45,747 | 42,467 | 92.83 |
| 2022 | 47,157 | 42,460 | 90.04 |
| 2023 | 47,702 | 41,488 | 86.97 |

**జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..**

పదోతరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు పరీక్షల టైం టేబుల్‌ను విద్యాశాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత పాఠశాలల్లో మే 16వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం పదిహేను రోజుల్లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.వెయ్యి రుసుం గా నిర్ణయించారు.

## వికారాబాద్ జిల్లాలో
# 65.10 శాతం ఉత్తీర్ణత

- 13,357 మందికి 8697 మంది విద్యార్థులు పాస్
- పది ఫలితాల్లోనూ బాలికలే ముందంజ
- 64 మందికి పదికి పది పాయింట్లు.. అందులో 9 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- గతేడాదితో పోలిస్తే కొంతమేర పెరిగిన ఉత్తీర్ణతాశాతం

వికారాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి ఫలితాల్లో జిల్లా అట్టడుగులో నిలిచింది. మంగళవారం విడుదలైన టెన్త్ రిజల్ట్‌లో ఈ ఏడాది కూడా చివరి స్థానంతో సరిపెట్టుకున్నది. ప్రభుత్వ బడుల్లో డిసెంబర్ నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినా ఆశించిన ఫలితాలను మాత్రం రాబట్టలేకపోయారు. అయితే సర్కారు బడుల్లో చదివిన స్టూడెంట్స్‌పై మొదటి నుంచి దృష్టి సారించకుండా కేవలం పరీక్షల సమయంలోనే ఉత్తీర్ణులయ్యేలా ఒత్తిడి తీసుకురావడంపై జిల్లా విద్యాశాఖ అధికారులపై విమర్శలు వెలువడుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై సంబంధిత అధికారుల అజమాయిషీ లేకుండాపోయిందనే ఆరోపణలున్నా యి. దీంతో ప్రైవేట్ బడులతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో 50 శాతం మేర కూడా ఫలితాలు రాలేదు. నాణ్యమైన ఉపాధ్యాయులున్నా ప్రతి ఏటా సర్కారీ స్కూళ్లలో ఉత్తీర్ణతాశాతం తగ్గుతూ వస్తున్నది.

**జిల్లాలో 65.10 శాతం ఉత్తీర్ణత...**

టెన్త్ ఫలితాల్లో జిల్లా 65.10శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాదితో పోలిస్తే కొంతమేర పెరిగింది. గతేడాది ఫలితాల్లో జిల్లాలో 59.46శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 65.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 13,357 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అందులో 8,695 మంది ఉత్తీర్ణులయ్యారు. 6,664 మం ది బాలురు పరీక్షలకు హాజరుకాగా 3,821మంది, బాలికలకు సంబంధించి 6,693 మం ది పరీక్షలు రాయగా 4,874 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 72.82 శాతం, బాలురు 57.34 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పదోతరగతి ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పదికి పది పాయింట్లు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 64 మంది విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించగా.. ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన 9 మంది విద్యార్థులు 10\10 పాయింట్లు సాధించి తామూ తక్కువేం కాదని నిరూపించారు. అయితే పదికి పది పాయింట్లు సాధించిన తొమ్మిది మంది విద్యార్థుల్లో ఆరుగురు ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థులుండడం గమనార్హం. గురుకుల పాఠశాలల్లో 98.68%, కేజీబీవీల్లో 65%, మాడల్ స్కూళ్లలో 61.14%, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 97.43%, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 90%, బీసీ సంక్షేమ పాఠశాలల్లో 90 శాతానికిపైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

మండలాల వారీగా సాధించిన ఉత్తీర్ణతాశాతం ఇలా..

| | |
|---|---|
| చౌడాపూర్ | 37.5% |
| యాలాల | 50.99% |
| తాండూరు | 68.99% |
| మోమిన్‌పేట | 57.43% |
| పెద్దేముల్ | 55.69% |
| పూడూరు | 64.42% |
| ధారూరు | 48.3% |
| బొంరాస్‌పేట | 73.13% |
| కులకచర్ల | 61.43% |
| కొడంగల్ | 67.93% |
| వికారాబాద్ | 80.06% |
| దోమ | 58.71% |
| పరిగి | 78.36% |
| నవాబుపేట | 59.42% |
| కోట్‌పల్లి | 50.29% |
| బంట్వారం | 66.1% |
| దౌల్తాబాద్ | 64.75% |
| బషీరాబాద్ | 42.27 % |
| మర్పల్లి | 56.39% |
| దుద్యాల | 67.74% |





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


# కాంగ్రెస్‌ను ఓడించాలి

- ఎస్సీ వర్గీకరణలో కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది
- ఎంపీ ఎన్నికల్లో హస్తం పార్టీకి బుద్ధి చెప్పడమే లక్ష్యంగా మాదిగలు కృషి చేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

వికారాబాద్, ఏప్రిల్ 30 : ఎస్సీ వర్గీకరణలో మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించడమే లక్ష్యంగా మాదిగలు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో బీజేపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరుగకుండా మాదిగలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఇప్పటికీ మాదిగల సరైన ప్రాధాన్యం ఇవ్వడంలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీనీ ఎమ్మార్పీఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో మాదిగలకు అవకాశం ఇవ్వకుండా ఎన్నో ఏండ్లుగా అన్యాయానికి గురి చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగులు, రైతులు, కార్మికులకు చేసిందేమీలేదన్నారు. అనంతరం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలను వివరించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆనంద్, బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## వానకాలం సాగు
# 5.97 లక్షల ఎకరాలు

- సాగు ప్రణాళికను ఖరారు చేసిన వ్యవసాయ శాఖ
- వికారాబాద్ జిల్లాలో 2.63 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేసేలా ప్లాన్
- గతేడాదితో పోలిస్తే పత్తి, కంది, మొక్కజొన్న సాగు పెరుగుతుందని అంచనా
- మే మొదటివారం లోగా జిల్లాలో అందుబాటులోకి ఎరువులు, విత్తనాలు
- ఖరీఫ్‌కు 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా




వికారాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): వానకాలం పంటల సాగుకు సంబంధించి జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను రూపొందించారు. రైతులకు లాభాన్నందించాలనే లక్ష్యంతో.. ఈ ఏడాది కొన్ని రకాల పంటల సాగును పెంచుతూ, మరి కొన్ని పంటల సాగును తగ్గించారు. అయితే గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 30 వేల ఎకరాలకుపైగా పెంచుతూ సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 3 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు పెరుగుతుందని అధికారులు అంచనా వేశా రు. గతేడాది 2.61 లక్షల ఎకరాల్లో పత్తి పంట జిల్లాలో సాగు కాగా.. ఈ ఏడాది 2.63 లక్షలకుపైగా ఎకరాల్లో తెల్ల బంగారాన్ని సాగు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా కంది పంట సాగును పెంచేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. గతేడాది 1.04 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగుకాగా, ఈ ఏడాది 1.50 లక్షల ఎకరాలకు పెం చాలని భావిస్తున్నది. అందుకోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. మరోవైపు మొక్కజొన్న సాగు కూడా పెరుగుతుందని, వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 23 వేల ఎకరాల మేర తగ్గనున్నదని అధికారులు అంచనాలను రూపొందించారు. మొత్తంగా జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగు అవుతుందని జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను రూపొందించారు. అందులో పత్తి–2,63, 500 ఎకరాలు, కంది–1,50, ఎకరాలు, మొక్కజొన్న–50,450ఎకరాలు, వరి– 1,10,000 ఎకరాలు, మినుములు–5000 ఎకరాలు, సోయాబీన్–2500 ఎకరాలు, జొన్నలు–2500ఎకరాలు, పెసర్లు–13,000 ఎకరాల్లో సాగవుతుందని ప్రణాళికను సిద్ధం చేశారు. అయితే గతేడాది ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 5.81 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగుకాగా.. అందులో వరి–1,34,857 ఎకరాలు, మొక్కజొన్న–55,751, జొన్న–2,033, కందులు–1,31,284, పెసర్లు–13,453, మినుములు–5175, పత్తి–2,30,285 ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

**75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం...**

వ్యవసాయాధికారులు రూపొందించిన సాగు ప్రణాళికకు సరిపడా ఎరువులు, విత్తనాల ను మే మొదటి వారంలోగా అందుబాటులో ఉంచేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే జిల్లాలో పీఏసీఎస్ డీలర్లు, కంపెనీ గోదాంలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే ఎరువులను సరఫరా చేయాలని నిర్ణయించారు. వానకాలంలో యూరియా, డీఏపీ, ఎన్‌పీకేఎస్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ ఎరువులు అన్ని కలిపి 75,437 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అందులో యూరియా–32,329 మెట్రిక్ టన్నులు, డీఏపీ–17,719 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు–19,877 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ–3,658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ–1,854 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో 2.63 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేయగా 5,42,400 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు, వరికి సంబంధించి 27,500 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న– 4,036, పెసర్లు–1040, కందులు–4500 , మినుములు–400, సోయాబీన్–750 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

### సకాలంలో ఎరువులు, విత్తనాలు



రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాలు ప్రారంభమైన తర్వాత రైతులంతా ఒకేసారి ఎరువులు కొనేందుకు వచ్చి ఇబ్బందులు పడకుండా ముందే కొని నిల్వ చేసుకోవాలి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. నకిలీ విత్తనాలపై రైతులు కూడా అవగాహన పెంచుకోవాలి. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలను కొనాలి.

**- గోపాల్, వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి**